రుణమాఫీ అమలయ్యేనా!

- రూ.25 వేల వరకు మాత్రమే మాఫీ
- బ్యాంకుల్లో పెరిగిపోతున్న వడ్డీ
- కొత్త రుణాలు ఇవ్వని బ్యాంకులు
- ఇబ్బందుల్లో రైతన్నలు

దౌల్తాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ నెరవేరుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు లక్ష రూపాయల వరకు పంట రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. ఇప్పటి వరకు కేవలం రూ.25 వేల వరకు మాత్రమే మాఫీ చేసింది. నాలుగు వాయిదాల్లో రుణమాఫీ చేస్తామని గతంలో ప్రకటించిన సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు ఒక్క వాయిదా కూడా చెల్లించలేదు. దీంతో హామీ నీటిమూటలు గానే మారుతుందని రైతులు ఆరోపిస్తున్నారు.

నిరాశలో రైతన్నలు..

ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో రైతన్నలు నిరాశ చెందుతున్నారు. మొదటి విడతగా రూ.25 వేలు మాత్రమే మాఫీ చేయగా అది కూడా కొంత మంది రైతులకు మాత్రమే వర్తించింది. మిగతా రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. సర్కారు రుణమాఫీ చేస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు. రూ.లక్షలోపు పంట రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం లేదు.


దుక్కి దున్నుతున్న రైతు

రుణమాఫీ సొమ్ము వడ్డీకే సరి..

ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో ఇది వరకు రైతులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలకు సంబంధించి వడ్డీ భారం తడిసిమోపెడవుతుంది. ప్రభుత్వం బ్యాంక్ రుణాలను మాఫీ చేస్తుందన్న నమ్మకంతో చాలా మంది రైతులు బ్యాంకుల వైపు కన్నెత్తి చూడడంలేదు. రుణాలను రెన్యువల్ చేసుకోవాలని బ్యాంక్ అధికారులు చెబుతున్నా రైతులు పెడచెవిన పెడుతున్నట్లు తెలుస్తోంది. రుణమాఫీ అవుతుందనే ధీమాతో రుణాలను సైతం చెల్లించకపోవడంతో ఇప్పుడు వడ్డీ, అసలు కలిపి రెండింతలయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకవేళ ప్రభుత్వం రుణమాఫీ చేసినా వచ్చిన సొమ్ము వడ్డీకే సరిపోయే దుస్థితి నెలకొంది.

16 వేల మంది అర్హులుగా గుర్తింపు

మండలంలో 16 వేల మంది రైతులను అధికారులు అర్హులుగా గుర్తించారు. గతేడాది మండలంలో కోఆపరేటివ్ సొసైటీ, ఎస్‌బీఐ బ్యాంకు, బాలంపేట, రావల్‌పల్లి ఏపీజీవీబీ బ్యాంకుల్లో 700 మంది రైతులు రూ.25 వేల చొప్పున రుణమాఫీ పొందగా మిగిలిన లక్ష రూపాయల లోపు రుణాలు ఉన్న వారికి రుణమాఫీ కావాల్సి ఉంది. పాత రుణాలు చెల్లించకపోవడంతో రైతులకు బ్యాంకులు కొత్త రుణాలు మంజూరు చేయడంలేదు. దీంతో మండల వ్యాప్తంగా రైతులు వానాకాలం సాగుకు అవసరమైన పెట్టుబడులకు నానా తిప్పలు పడ్డారు. విత్తనాలు, ఎరువులు కూలీల ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేస్తే సమస్యలు ఉండవని రైతులు పేర్కొంటున్నారు.

మాఫీ చేస్తే బాగుంటుంది



రైతులకు లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. దీంతో బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు చెల్లించలేదు. ఒకవేళ మాఫీ చేయలేమని చెబితే రైతులు అప్పుడే సమయానికి చెల్లించేవారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ధీమాతో ఉన్నారు. ఇప్పుడు రుణాల కోసం బ్యాంకులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి వెంటనే మాఫీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– నర్సప్ప , రైతు, దౌల్తాబాద్

గ్రామ కంఠం భూమిని కాపాడండి

తహసీల్దార్‌కు మంబాపూర్ గ్రామస్తుల వినతి


పెద్దేముల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు, తదితరులు

పెద్దేముల్: పల్లె ప్రకృతి సమీపంలో ఉన్న గ్రామ కంఠం భూమి ఆక్రమణకు గురవుతున్నందున దానిని కాపాడాలని మంబాపూర్ వాసులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం మంబాపూర్ ఎంపీటీసీ సభ్యుడు యాలటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు నారాయణ, ప్రకాశం, పంచాయతీ వార్డు సభ్యులు, పలువురు గ్రామస్తులు కలిసి తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మప్పలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మంబాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనం సమీపంలో కొంత గ్రామ కంఠం స్థలం ఉందని, దానిని కొందరు కబ్జా చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ స్థలంపై మండల అధికారులు సర్వే చేసి కాపాడాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతోనే అభివృద్ధి


సీడీపీ నిధులతో ఎస్సీ కాలనీలో వేస్తున్న సీసీ రోడ్డు

యాలాల: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బీఆర్‌ఎస్ యువ నాయకుడు వెంకట్ అన్నారు. సోమవారం మండలంలోని పేర్కంపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఐదున్నర లక్షల రూపాయల సీడీపీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో సీడీపీ, ఈజీఎస్, అభివృద్ధి పనులు రూ.50 లక్షల నిధులతో జోరందుకున్నాయన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే కట్టుబడి ఉన్నారన్నారు. అవసరమైన చోట సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ, ప్రభుత్వ భవనాల నిర్మాణాల మంజూరు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్రిష్ణ, గోవింద్, రాంచందర్‌గౌడ్, రవిగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది నిరసన


అంగన్‌వాడీ టీచర్ల కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

ధారూరు: అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సోమవారం జరిగిన సెక్టార్ మీటింగ్‌లో మండల అంగన్‌వాడీ టీచర్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇస్తున్నట్లుగా తమకు సమానంగా వేతనాలు, సెలవులు ఇవ్వాలని, పీఆర్‌సీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. అనంతరం వారు సీఐటీయూ నాయకుడు మహిపాల్‌తో కలిసి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతిబాయికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, సీఐటీయూ నాయకులు కవిత, భాగ్యలక్ష్మి, చంద్రకళ, శారద, ప్రమీల, సుజాత, ఆర్.మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: పెండింగ్‌లో ఉన్న మా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం మెప్మాలో పనిచేసే ఆర్‌పీలు, కేజీబీవీల్లో పనిచేసే నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు వేర్వేరుగా వికారాబాద్ ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

ఉత్తమ ఉద్యోగికి సన్మానం


ఏపీఓ రాములుకు స్వీట్ తినిపిస్తున్న నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు

కొడంగల్ రూరల్: ఇటీవల జిల్లా కేంద్రంలో ఉత్తమ అవార్డు అందుకున్న మండల ఏపీఓ రాములును టీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు ఘనంగా సన్మానించారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ సమావేశం హాలులో ఏపీఓకు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఏపీఓ రాములుకు ఉత్తమ ఉద్యోగి అవార్డు రావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రఘు, ఫీల్డ్ అసిస్టెంట్లు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తుర్కయంజాల్: దశలవారీగా వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని 18వ వార్డు కౌన్సిలర్ కాకుమాను సునీల్ అన్నారు. సోమవారం కమ్మగూడలోని భవానీపురం కాలనీలో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రామారావు, రమేష్, వెంకటేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విజ్ఞానానికి గ్రంథాలయాలు దోహదం

జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ రాజుగౌడ్

కొడంగల్ రూరల్: గ్రంథాలయాలు యువతకు విజ్ఞానాన్ని అందించేందుకు దోహదపడతాయని, ఇందుకుగాను గ్రంథాలయాలలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ఉంచేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ రాజుగౌడ్ తెలిపారు. పట్టణంలోని అంగడిబజార్ సమీపంలో ప్రారంభానికి సిద్ధమైన శాఖా గ్రంథాలయాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. మిగిలిన కొద్ది పాటి పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు చైర్మన్ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాఖా గ్రంథాలయాన్ని త్వరలోనే ప్రారంభించేందుకు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో కలిసి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణ శివారులోని గాడిబాయి శివాలయంలో శివస్వాములు చేపట్టిన పల్లకీసేవ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివస్వాములు, ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ సమీపంలో నూతన షెడ్డును నిర్మించేందుకు రూ.5 లక్షల నిధులతో ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అలాగే మండల పరిధిలోని చిట్లపల్లి దర్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, సర్పంచ్‌లు సయ్యద్ అంజద్, వెంకట్‌రెడ్డి, టీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గోడల రాంరెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు, డాక్టర్ నవాజొద్దీన్, ఫహీమ్, సాయిలు, గాడిబాయి శివాలయ అర్చకుడు కిట్టుస్వామి తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ రాజుగౌడ్, తదితరులు

లేబర్‌కార్డుకు దరఖాస్తు చేసుకోండి


హమాలీ సంఘం కార్మికులకు గుర్తింపుకార్డులను అందజేసిన అధికారులు, నేతలు

తహసీల్దార్ రమేశ్‌కుమార్

కుల్కచర్ల: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కూలీలందరూ తప్పనిసరిగా లేబర్‌కార్డును పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కుల్కచర్ల తహసీల్దార్ రమేశ్‌కుమార్, కుల్కచర్ల ఎస్‌ఐ గిరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా ఛత్రపతి శివాజీ హమాలీ సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు లేబర్‌కార్డును పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. లేబర్‌కార్డు వల్ల వివిధ రకాలైన ప్రయోజనాలు ఉన్నాయని, ఇన్సూరెన్స్ కల్పించడంతో పాటుగా వారి పిల్లలకు ఆరోగ్య సంబంధిత అంశాలలో కార్డు ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల సర్పంచ్ సౌమ్యారెడ్డి, ఎంపీటీసీ ఆనందం, పరిగి నియోజకవర్గ పరిరక్షణ అధ్యక్షుడు రాఘవేందర్, జన్‌సహస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్, మండల కోఆర్డినేటర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గాడిబాయి శివాలయంలో పూజలు

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని గాడిబాయి శివాలయంలో సోమవారం ఉదయం శివస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీస్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. గాడిబాయి శివాలయం నుంచి ప్రధాన రహదారిలో ఉన్న బసవేశ్వర దేవాలయం, వీరభద్రేశ్వర ఆలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మహాదేవుని ఆలయానికి చేరుకున్నారు. దారిపొడవునా పల్లకీసేవ ముందు రైతులు తమ నందీశ్వరుల(ఎడ్ల)తో శివస్వాములు ఖడ్గాలు వేస్తూ స్వామివారిని భక్తిశ్రద్ధలతో స్మరించారు. మహాదేవుని ఆలయం నుంచి గాడిబాయి శివాలయం చేరుకున్నాక శివలింగానికి పంచామృతంతో అభిషేకం, శివాష్టకం, లింగాష్టకం, శివాష్టోత్తర శతనామావళి, శరణు ఘోష, ధూపం, దీపం, నైవేద్యం సమర్పిస్తూ మంగళహారతులు అందిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టత గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా రూ. 50 లక్షల నిధులు కేటాయిస్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. గాడిబాయి శివాలయం నుంచి బండల ఎల్లమ్మ దేవాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు ఆలయ ఆవరణలోని గాడిబాయిని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిట్టుస్వామి, కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీమహాదేవుని ఆలయ ఆవరణలో పల్లకీసేవ ఎదుట నందీశ్వరులతో శివస్వాములు

వ్యక్తిత్వ వికాస నిర్మాణంపై అవగాహన


ప్రొఫెసర్‌ను సన్మానించిన అధ్యాపకులు

పరిగి: కష్టపడి చదివితే సాధించలేనిదంటూ ఏది లేదని పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణారావు సూచించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని తుంకుల్‌గడ్డలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస నిర్మాణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు, అధ్యాపకులు చెప్పిన దాని ప్రకారం నడుచుకోవాలని సూచించారు. గురువుల పట్ల గౌరవం, నమ్మకం, అంకితభావంతో మెలుగుతూ వారు చెప్పిన విషయాలను పాటిస్తూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చెప్పారు. అధ్యాపకులు చెప్పిన విషయాలను పాటిస్తూ తమ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు భాస్కరయోగి, సాయినాథ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వద్దు

తాండూరు డివిజన్ పంచాయతీ అధికారి శంకర్‌నాయక్

కొడంగల్ రూరల్: గ్రామాల్లో ఇంటి పన్నులు వందశాతం వసూలు చేస్తూ అభివృద్ధికి కృషి చేయాలని తాండూరు డివిజన్ పంచాయతీ అధికారి శంకర్‌నాయక్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని హుస్సేన్‌పూర్, పర్సాపూర్, ఉడిమేశ్వరం, అప్పాయిపల్లి తదితర గ్రామాల్లో ఆయన ఆకస్మిక పర్యటన చేసి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పనులు చేపడుతూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా ఇంటి యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. నర్సరీల్లో మొక్కల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వందశాతం సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మొక్కలకు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఆయా పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలను రికార్డుల్లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, హుస్సేన్‌పూర్, పర్సాపూర్, అప్పాయిపల్లి, ఉడిమేశ్వరం గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కొండయ్య, కల్పన, లావణ్య రేఖ, షేక్ మహిబూబ్ తదితరులు పాల్గొన్నారు.


హుస్సేన్‌పూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న అధికారి శంకర్‌నాయక్

జీరో సర్వీస్‌తో బదిలీలకు అనుమతి ఇవ్వాలి

టీపీయూఎస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు

దోమ: జీరో సర్వీస్‌తో ఉపాధ్యాయుల బదిలీలకు అనుమతులు ఇవ్వాలని టీపీయూఎస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 317 జీఓతో ఉపాధ్యాయులు స్థానికతను కోల్పోయి నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు స్థానికంగా ఉద్యోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్‌లో చిన్న చిన్న తప్పులు జరిగినప్పుడు వాటిని సరి చేసుకోవడానికి ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలన్నారు. ఎడిట్ ఆప్షన్ లేకపోవడం ద్వారా ఉపాధ్యాయులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 317 జీఓతో వివిధ జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు సరైన వివరణ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

సమయానికి బస్సులు నడపండి

తాండూరు డీఎంకు ఎంపీపీ వినతి

యాలాల: మండల పరిధిలోని ముద్దాయిపేట, జుంటుపల్లి, రేళ్లగడ్డతండా, అక్కంపల్లి తదితర గ్రామాలకు సమయానికి అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులు నడపాలని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా కోరారు. ఈమేరకు సోమవారం తాండూరు డిపో మేనేజర్ సమతకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు గ్రామాల సర్పంచ్‌లు ఆర్టీసీ సర్వీసుల సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ విషయమై స్పందించిన ఎంపీపీ బస్సులు సమయానికి అనుగుణంగా నడపాలని కోరారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సర్వీసులు లేకపోవడంతో విద్యార్థులు, రైతులు, వయోజనులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్‌లు క్రిష్ణయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణలు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. సర్పంచ్‌లు కోరిన విధంగా బస్సు సర్వీసులు నడపాలని కోరారు. ఈ విషయంలో డీఎం సానుకూలంగా స్పందించి సర్వీసులు సమయానికి అనుగుణంగా నడుపుతామని హామీ ఇచ్చారు. అనంతరం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా డీఎంతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద ఇంటి నిర్మాణానికి చేయూత

మంచాల: నిరుపేదలకు అండగా నిలుస్తామని వీఆర్‌వన్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.కె.భిక్షపతి అన్నారు. సోమవారం మంచాల మండల పరిధిలోని జాపాల గ్రామానికి చెందిన హైమావతికి గృహనిర్మాణ నిమిత్తం 30 బస్తాల సిమెంట్, ఒక ట్రాక్టర్ ఇసుకను ఫౌండేషన్ ద్వారా ఉచితంగా సరఫరా చేశారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయండి

- మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ డిమాండ్
- మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని, కార్మికులు ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, యూనిఫామ్‌లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. మహిపాల్ మాట్లాడుతూ.. రెండు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. దీంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు కూడా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐ ఆస్పత్రి వికారాబాద్‌లోనే ఏర్పాటు చేయాలన్నారు. పీఎస్ సౌకర్యం సక్రమంగా లేదని పీఎఫ్ కటింగ్ రశీదులు కార్మికులకు ఇవ్వాలన్నారు. కార్మికులకు 8 గంటల పని విధానం అమలు చేయడంతో పాటు, పండుగ రోజుల్లో సెలవు ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బిచ్చయ్య, శంకర్, రాములు, కుమార్, యాదయ్య, సాయికుమార్ పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు


అనంతగిరి: క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

గాంధీ పోరాటం మరువలేనిది

భారతదేశ స్వాతంత్య్ర పోరాటంలో మహాత్మాగాంధీ చేసిన పోరాట పటిమ మరువలేనిదని పలువురు పేర్కొన్నారు. సోమవారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర చోట్ల గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్య్రం సిద్ధించేందుకు ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్


పరిగి: గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్ అశోక్ ముదిరాజ్


కొడంగల్ రూరల్: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు

కొనసాగుతున్న కంటివెలుగు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. రెండో విడత కంటి వెలుగులో భాగంగా మంగళపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో సోమవారం 152 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి, డాక్టర్లు పరీక్షిత్ నరేందర్, మంజులాదేవి, సిబ్బంది తిరుపతిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం తనిఖీ..

తలకొండపల్లి: మండల కేంద్రంలో కొనసాగుతున్న కంటివెలుగు వైద్య శిబిరాన్ని సోమ వారం తహసీల్దార్ కృష్ణ తనికీ చేశారు. ఇప్పటి వరకు ఈ కేంద్రంలో 909 మంది రోగులను పరీక్షించినట్లు డాక్టర్ స్నేహ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, జ్యోతయ్య తదితరులు పాల్గొన్నారు.